
# అభినవ శాకున్తలమ్

యన్నంరెడ్డి వెంకటరెడ్డి



### ఈ కథకు ముగింపు?

ఈ కథ ఈనాటిది కాదు!

*    *    *

ప్రకృతి నీరవ నిశ్శబ్దంలో మునిగి చీకటి ఒడిలో సేద దీర్చుకునే సమయం. కొంగలు బారుగా తీరి ఏ తీరాలకో పయనం కట్టుకున్నట్టు ఆకాశ మార్గాన తోరణాలను తలపులకు తెస్తూ సాగి పోతున్నాయి. సీతాకోక చిలుక ఈ రాత్రికి ఏ పంచ తలదాచుకుందామా అని తటపటాయిస్తూ రెక్క లాడిస్తూ అక్కడే తచ్చాడుతూంది.

కిచకిచమంటూ పిచ్చుకల అల్లరి.

పావురాలు గూళ్ళకు చేరిపోయాయి.

నెమలి చెట్టుకొమ్మను చేరిపోయింది.

చెట్టు కొమ్మా, రెమ్మా మునిలా స్తబ్దగా ఉన్నాయి.

ఆ ఏటి ఉరకల పరుగుల పరవళ్ళ లయ— ఆ ప్రశాంత ఆశ్రమ వాతావరణంలో తన ఉనికిని చాటు కుంటూంది.

ఆమె అగ్గిపుల్ల గీసి లాంతరు వెలిగించింది.

ఆ వెలుగులో ఆమె పుత్తడి బొమ్మలాగ మెరిసి పోతోంది

ఆ కళ్ళను మరపించే ఆ కళ్ళు—

చక్రాల కళ్ళకు చారడేసి కాటుక, బుగ్గలకి సిగ్గులు.

ఏకం ముఖంలో ప్రశాంత చంద్రకాంతి—

వీణలా మాట పలుకు, నడకలో సెలయేటి దుడుకు—

నవ్వులో రత్నాల రాసిళ్ళ ధ్వని

ఆమె తీరులో కొట్టొచ్చే లక్షణాలవి.

అంతలో అణగారిన నిశ్శబ్దం మేలుకుని రెక్క లొచ్చి చప్పుడు చేస్తూ ఎగిరిపోయింది. ఎండిపోయిన ఆకులు తమ ఉనికిని చివరిసారిగా ప్రదర్శించి కొన వూపిరి తీసుకుంటున్నాయి.

ఆమె తలపైకెత్తి, ఉనికి తెలిపిన ఆకులకేసి చూసింది.

'ఒంటిగా ఉన్న ఈ వేళప్పుడు గాంధీ ఆశ్రమా నికి ఎవరొచ్చారబ్బా?' మనసులోని తలపులకు తలుపు తీసి అటు చూసింది.

బయట గేటు తలుపు తీస్తూ ఒక యువకుడు లోపలికి వస్తున్నాడు. అతనిచేతిలో తుపాకి ఉంది.

'ఎందుకొస్తున్నాడో!' లోలోపలి అనుమానాన్ని దాచుకుని—'మీరు వచ్చిన పని తెలుసుకోవచ్చా..?' అని దగ్గరికి చేరిన ఆయువకుడిని అడుగుదామను కుని ఆగి పోయింది.

కారణం ఆ యువకుడి ముఖ వర్చస్సు ఆమె మాటలను మరపింప చేసింది.

గిరజాలు తిరిగిన జుట్టు.. సైడ్ లాక్స్... తెల్ల తెల్ల పేంటుపై లేత గులాబి రంగు షర్టు. కళ్ళకి నిండైన అద్దాలు.. చేతికి ముత్యాల ఉంగరాలు రెండు...

అతని అందం ఆమెను చకితురాల్ని, వివశురాల్ని చేసింది. రెప్పపాటును మరపింపించింది.

ఆమె మాటలు ఆమెలోనే దాగిపోయేయి. దరి చేరగానే మాట రాలేదు. తడబడింది. లేడిలా బెదిరింది.

ఆ యువకుడు ఆమె కళ్ళల్లోకి తన చూపును గుచ్చి చూశాడు.

చురుక్కు మన్నట్టు ఆమె చటుక్కున సర్దుకుని "ఎవరు కావాలి?" అని మాత్రం అంది తడబడుతున్న గొంతులో.

'ఎక్కడిదా వీణా తంత్రీ నిస్వనం' అని స్వగతంలో అనుకుని, ఆమె కంఠాన్ని వింటూ ఉండిపోయిన అతన్ని ఆమె మళ్ళీ ప్రశ్నవేసి రెట్టించింది.

'ఏం బదులు చెప్పాలి?' అనుకుని, కంగారుపడి, ఎటూ పాలు పోక "ఈ ఆశ్రమంలో ఎవరూ లేరా?" ప్రశ్నకు జవాబుగా ప్రశ్న వేశాడు.

"ఉన్నారు. . కానీ, ఇప్పుడు లేరు."

"ఎక్కడికి వెళ్ళారు?"

"సాంఘిక సేవా కార్యక్రమానికి. ."

"ఏ వూరు?"

చెప్పింది.

"గాంధిగారు ఇక్కడికి వస్తుంటారా?"

"ఆ. . ."

"ఎప్పుడువచ్చారు?'

"పది రోజుల క్రితం"

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

"రేపు. . ."

"ఆ. .. రేపే వస్తారా?" అతనిలో ఆశ్చర్యం చోటు చేసుకుంది.

"వారిని కలుసుకోవాలా?"

ఈ రాత్రికి అతను ఇక్కడే ఉంటే ఎంత బావుంటుంది. ఆయన అందం.. . ఆ ఆకర్షణా. . ఆ అయస్కాంతపు కళ్ళు.. అబ్బ. . బుగ్గలకి సొట్టలు ఎంత అందాన్నిస్తున్నాయి. ఒక్కసారి ఉదయం పూట చూస్తే... భగవాన్, ఏమిటి? ఏమిటి నాలో ఈ ఘర్షణ. . ఎందుకీ తీయని తలపుల సంఘర్షణ. . ఎందుకీ చూడాలన్న తపన? ఎందుకీ వ్యామోహం. . ? భగవాన్ తన ఈ వూహల గుర్రానికి కళ్ళెం వెయ్యి—

అనుకుని అచేతనత్వాన్ని జయించి, ఏదో అనబోయి, ఆ యువకుడిని చూసి మళ్ళీ అచేతనంగా ఉండి పోయింది.

పున్నమిని చూసిన సముద్రంలా హృదయం ఇలా ఎగిరెగిరి పడుతోందేం? ఆగలేని ఉధృతంలో వెన్నెల తుఫానులా మనసు ఇలా పారుతోందేం? ప్రశాంత అహ్లాద మధుమాస ఏమిటి నిట్టూర్పుల వేడి గాడ్పులు. . .? తనలో ఎందుకీ రక్తపు హోరు. . . హృదయ ప్రకంపనాల స్థాయి పెరిగి వెన్నులో వణుకు పుడుతోందేం? కింది పెదివి కండరం బిగిసి, ఉండీ ఉండీ అలా అల్లల్లాడులోందేం? అనంత గాలి స్తంభించి పోలేదు కదా? !

అల్లిబిల్లిగా సాగిన ఆ యువకుడి గజిబిజి ఆలోచన లవి!

ఆమె, అతను—గాఢంగా నిట్టూర్చారు.

నేల చూపులు చూస్తోంది ఆమె!

దిక్కు తోచని అతను గాంధీ ఫోటోను చూస్తూ, "రేపు వచ్చేస్తారా?" ఫోటో నుండి దృష్టి మరల్చకుండా అడిగాడు.

"ఆ. . ."

బయట జల్లులు జల్లులుగా కురుస్తూన్న వర్షంలా దట్టంగా మంచు కురుస్తూంది. లోపల చీకటి తెలులు తెలులుగా వాలుతోంది.

ఆ చీకటితో సమరాన్ని చాలించిన దీపం వోటమిని అంగీకరించి రెపరెపమని గాలికి వీగిపోతూంది.

ఆ చీకటిలో—

ఆమె ముక్కెర ఆ దీపపు వెలుగులో వేగుచుక్కలా మెరిసింది.

ఆ మెరుపు ఆ యువకుడి కళ్ళల్లో గుచ్చుకుపోయింది.

నిబ్బరించుకున్న హృదయంతో, "మీరు. . ." అని ఆమె ముఖం లోకి చూసే ధైర్యం లేక తల దించుకున్నాడతను.



దూర తీరాలు — ఎస్. ఉమామహేశ్వరరావు

ఆమె తలెత్తి, తల దించుకున్న అతన్ని కళ్ళారా చూసింది.

"చెప్పండి. . ." అని, అతన్ని సూటిగా చూసే ధైర్యం చాలక తల దించుకుం దామె.

అప్పుడామెను చూసి నిగ్రహించుకోలేక పోయాడు. పిచ్చెత్తి సట్టలుపోయాడు. విచక్షణా జ్ఞానం నశించే తరుణంలో ఎలాగో అతి కష్టం మ్మీద నిగ్రహించుకుని, వాస్తవంలోకి వచ్చి, అడిగింది గుర్తెరిగి "ఏమా. . . మీరు ఇక్కడెందుకుంటున్నారు?"

ఆమెలో కదలిక ప్రారంభమయింది.

"అయ్యో. . . మర్యాదగా గంట నుంచీ మిమ్మల్నిలాగే నిలబెట్టేశాను. . . క్షమించండి. . ."అంటూ వెనక్కి తిరిగింది ప్రశ్నకు దూరమై.

ఆమె పొడవాటి జడ స్పర్శ అతనికి తగిలి మహోన్నతానుభూతిని కలిగించింది.

ఆ పులకరింతలో ఏదో గిలిగింత

ఆ గిలిగింతలో ఏదో ఏదో గుబగుబ. . .

చాపతో తిరిగొచ్చి "కూర్చోండి". . . అంది చాప పరుస్తూ.

"ఫరవాలేదు' అని అనబోయి, చాతకాక మంత్రముగ్ధుడిలా చాప మీద కూలేడు.

ఆమెకూడా చాపమీదే ఒక చివర కూర్చుని 'ఇప్పుడు చెప్పండి' అంది.

మెల్లగా తల పైకెత్తి 'ఇక్కడుంటున్నారేం?" అన్నాడతను.

చిత్రంగా కళ్ళు తిప్పి "ఎక్కడుండమంటారు?" అంది.

ఏదో అనబోయేంతలో—

"ఎక్కడయినా నన్ను చూశారా?"

"ఆ. . . ఆ. . .అదే. . . ఎక్కడో సరిగా గుర్తుకు రావడం లేదు."

"ఎక్కడో నన్ను మీరు చూశారా? అసంభవం. నేను మిమ్మల్ని ఎక్కడా చూడలేదు."

"అయితే కావచ్చు. కానీ, వైజయంతీమాలను చూసినంత మాత్రాన నన్ను వైజయంతీమాల చూడాలనుందా?

సిగ్గుతో మొగ్గలా ముడుచుకుందామె.

"అది కాదు. నేను ఎక్కడికీ ఎప్పుడూ వెళ్ళలేదు కదా? ఎక్కడ చూసుంటారని. . ."

"కలలో కాకపోవచ్చు. . ."

"మరయితే కలలో చూశారా?" మూతి ముద్దు ముట్టి, కనుబొమ ఎగరేసింది.

"కరెక్ట్". . .

ఆమె ముఖం మందారమయింది.

"మీరు భలేవారండి. . ."

"మీరూనూ. .."

ఆమె కంఠం లోంచి రత్నాలు రాపాడిన ధ్వని. . .

గూళ్ళలోని పావురాలు రెక్కలు చప్పుడు చేస్తూ ఎగిరి పోయాయి. అతని గుండె గూటిలో దాగి ఉన్న 'భయంకి' రెక్క లొచ్చి చీకట్లోకి ఎగిరి పోయింది.

"ఇంతకీ నా ప్రశ్నకు సమాధానం. . ." నవ్వుగా నాన్నాడు.

"చెప్పలేను. . ."

అతను ఇరుగు తిపబోయేంతలో—"ఒక్క మాటలో మీ ప్రశ్నకు జవాబు చెప్పలేను. . ." అంది.

వూపిరి పీల్చాడతను.

"అయినా ఆ సంగతులన్నీ మీ కెందుకు?" ఏం చెప్తాడా అన్నట్టు చూసింది.

"ఏమో. . ."

ఆమె బిత్తర పోయేంతలో, "మిమ్మల్ని చూస్తుంటే ఏదో తెలియని ఆత్మీయత కలుగుతోంది ఎందుకో. . ." అన్నాడు.

నిట్టూర్చిం దామె.

"నేను తుపాకి తీసుకొస్తే ఏ మాత్రం జంకలేదు. కారణం?"

"మేం ఆశ్రమవాసులం. జంకడమంటారా? మేం హింసా వాదులం కాము. మా దగ్గిరికి అలాంటి వారు రారు. మీరు వేటగాళ్ళని తెలుసు. మీకు వేటమీద విరక్తి కలిగి, హృదయ పూర్వకంగా స్వచ్ఛత పొందారనీ తెలుసు. . .రేపు".

"నాకూ తెలుసు. . . మీరు ఏదో బలీయమైన

కాలాంతరాల వల్ల ఈ ఆశ్రమవాసం చేస్తున్నానీ. . . మీరు''.

ఆమె కళ్ళ నుండి జారిన కన్నీళ్ళు అతని మాటల్ని ఆపాయి.

''ఎందుకు ఏడుస్తున్నారు. . .?''

తను తల్లి దండ్రుల ప్రేమకు నోచుకోని దౌర్భాగ్యురాలి నని. . . తన తల్లికి తను అక్రమ సంతతిని. . . తన నీ ఆశ్రమ ప్రాంతంలో వదిలి తన తల్లి ఎటో వెళ్ళి పోయిందనీ. . . అప్పటి నుండీ ఇక్కడే. . . ఈ గాంధీ ఆశ్రమం లోనే పెరుగుతూ వచ్చాననీ బాధతో, వేదనతో చెప్పింది.

ఒక్క నిట్టూర్పు విడిచి, చీకట్లోకి చూశాడతను.

''ఇంత చీకటి రాత్రిలో వూరికి దూరంగా ఉన్న ఈ ఆశ్రమంలో, ముక్కూ మొహం తెలియని ఒక మగాడితో మాట్లాడు తున్నందుకు భయం మీకు ఏమాత్రం వేయడం లేదా?''

''లేదు. . తప్పు చేయనంత కాలం ఎవరికీ భయపడ వలసిన పనిలేదు.''

''గుడ్. . . మీ ఆత్మోన్నత్యానికి నాజోహార్లు.''

ఆమె కళ్ళల్లో ఇంకా ఆరని కన్నీటి మెరుపు.

అతను చుట్టూ పరకాయించి చూస్తున్నాడు. టేబుల్ మీద గాంధి గారి ఫోటో. . దాని ముందు మూడు భంగిమలలో మూడు కోతుల బొమ్మలు. మూలన రాట్నం... దూది... ఏకులు...

గది చాలా శుభ్రంగా ఉంది.

''మీరు ఏమీ అనుకోనంటే ఒక్క ప్రశ్న. . . నా మనసంతా ఆ ప్రశ్నమీదే ఉంది. అడగనా...?''

''అడగండి. ... సందేహమెందుకు?''

''పున్నమి వెన్నెలను చూసిన కడలి ఎందుకు పొంగుతుంది?''

జవాబు తోచక, దిక్కు చూస్తోంది.

తలగోక్కుని జడ పూలను సరిచేసుకుంటోంది.

''పోనీ, పూవుకు తావి అబ్బితే ఎలా ఉంటుంది?''

ఉహూ!

''ఐతే, నే న్చెప్పనా?''

''ఉ''. .

''మధుర మనోహరంగా ఉంటుంది!''

''ఉంటే. . . ''

''కలల పంట పండుతుంది''

''అంటే. . . ''

''ఏమీ అనుకోనని మాటివ్వాలి.''

''సరే. . . ''

''సరేతో సరి పెట్టకండి.. ఒట్టేయ్యాలి. . . '' చేయి చాపే డతను.

సభ్యమానవుల్ని చూసి మానవత్వం ఉన్న మనుషులు చీదరించుకుంటే మనిషి మనుగడకు అర్థమేముంటుంది?—

''సరే. . . '' చేతిలో చేయి వేసిం దామె.

ఆ క్షణం—

—సృష్టిలయ గతి తప్పినా, ఈ క్షణం గుండె ఆగి పోయినా ఫరవాలేదు. ఈ అనుభూతి.·. ఈ అనుభవం శాశ్వతం కావాలి. జీవిత పరమార్థం ఇది అవును కాదో అనవసరం. ఐనా, ఒక్క అనుభూతిని మిగుల్చుకుంటాను.

అతను!

— పూవులోని మకరందం కోసం తుమ్మెద పూవు చుట్టూ తిరగడం ఎంత మనోహరంగా ఉంటుంది. ఎండిపోయిన బ్రతుకు పెదలో ప్రేమామృతం చిలికితే ఎంత మనోజ్ఞంగా ఉంటుంది. ఈ క్షణం శాశ్వతమైతే శతకోటి వీణల తంత్రీ నిస్వనలు ఒక్కసారి విన్న రసజ్ఞునికి ఎంత తృప్తి... పున్నమిలో ఆడుకోవాలని పిల్లలకెంత ఆరాటం. ఏ వయసుకా ఆవేశం ఆవేశానికి ముందు కాస్తంత ఆలోచనకు చోటుంచు తంత్రీ—

ఆమె! !

అతని చేతిలో వేసిన తన చేతిని మరచి ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి.

ఇద్దరి మతులూ గతులు తప్పి ఆలోచిస్తున్నాయి.

ఇద్దరి కళ్ళూ ఆరమోడ్పు లయ్యాయి.

ఇద్దరి ఒళ్ళూ రగులుకున్న వేడిలో కుతకుత లాడుతోంది.

''మనం ఇలాగే శాశ్వతంగా ఉండిపోదాం. మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను.. ''

తన చెవుల్ని తనే నమ్మలేక,' తనంతటి భాగ్యశీలా . . ?' అనుకుంది.

ఆమె మవునాన్ని అదునుగా చేసుకుని, ''నా తల్లి దండ్రుల సాక్షిగా ఈ మాట అంటున్నాను. . . ''

దానికీ ఆమె మవునంగానే సమాధాన మిచ్చింది.

''మిమ్మల్నే... మీ కిష్టం కాకపోతే చెప్పండి...'' మవునం.

''మీరు కాదన్న ఈ బ్రతుకు బ్రతికేకంటే'' తుపాకిని చూస్తూ అన్నాడు. .

''చావడం మేలంటారా? అది పిరికి వాళ్ళ లక్షణం... చావు సమస్యకు పరిష్కారం ఎప్పుడూ లాదని నా గాఢమైన నమ్మకం. . . ''

''ఐతే, మీ ఉద్దేశ్యం, . ?''



''మీ ఉద్దేశ్యమే— నాదీనూ. . . ''

''ఏమండీ—''

''నాపేరు శకుంతల...శకుంతల అనండి చాలు—''

''శకుంతలా... నేనెంతటి భాగ్యశీలిని... నీదెంతటి విశాల హృదయం. . మన దెంతటి అదృష్టం.. ''

శకుంతల నవ్వింది— మంద్రంగా!

''ఈ జన్మకీ వరం చాలు శకుంతలా! ఈవరం చాలు. . '' కలలో పరవశిస్తూ కలవరిస్తున్నట్టుగా అంటున్నాడు.

''శకుంతలా... ఈ ప్రకృతి సాక్షిగా, పంచ భూతాల సాక్షిగా, గాంధిగారి సాక్షిగా, నా ఆత్మ సాక్షిగా, నా తల్లిదండ్రుల సాక్షిగా నిన్ను నా అర్ధాంగిగా స్వీకరిస్తున్నాను. ఈ క్షణం నుంచీ నీవు నా అర్ధాంగివి శకుంతలా. . . '' దగ్గరగా జరిగా డతను.

''ఇప్పుడే కాదు. . '' అంటూ లేచి, గాంధిగారి పటం ముందున్న రెండు పూల దండల్ని తీసి ఒకటి అతనికి ఇచ్చి, మరోటి తన చేతిలో ఉంచుకుంది శకుంతల.

''ఇప్పుడు ప్రమాణం చేసి నా మెడలో దండ వేయండి.''

చేశాడు. దండ మెడలో వేశాడు. శకుంతలకు భర్త అయ్యాడు. శకుంతల అతని మెడలో కూడా దండ వేసి, అతని భార్య అయింది. ఇద్దరూ చాప పాన్పుపైకి ఒరిగేరు.

మూగబోయిన హృదయాలను వివాహబంధం కలిపి, దగ్గర చేసి సరాగాల మాటలను కలుపుతూంది.

ఇద్దరి గుండెలూ మాట్లాడుకుంటున్నాయి.


ఇద్దరూ ప్రేమైక రాజ్యాన్ని ఏలుతున్నారు.

మమేక మయ్యారు.

గదిలో గాంధీగారు బోసిగా నవ్వుకుంటున్నారు.

మధ్య కోతిని చూసి నిట్టూర్చింది— గది!

తమ తమ కోరికల సుఖాలను అందుకోవాలని ఒకరి నొకరు జుర్రు కుంటున్నారు.



చాప మీదఆతను ఆమెను ఆక్రమించు కుంటున్నాడు.

చాప క్రింద నీరులా ఆమెలో కలిసి కరిగి పోయాడు.

"కో... కో... కో..." మని నెమలి ఆందోళనతో ఆర్తాంతరంగా అరుస్తోంది. తెగిన తీగె పలికిన వీణలా అపస్వరంగా ఉందా అరుపు.

కీచురాళ్ళ భయంకర రొద ఆ ప్రాంతంలో ప్రతిధ్వనిస్తోంది.

ఆ మాధవీలతమీద అస్తిత్వాన్ని కోల్పోయిన మంచు బిందువులు చుక్క చుక్కగా క్రిందికి జారుతున్నాయి.

ఇద్దరి వేడి చల్లారి పోయింది.

కోరిక తీరిన వాస్తవంలో చలిగాలి రివ్వున వీస్తోంది. అంత వరకూ వంటికి తగలని చలిగాలి, ఎముకల్ని కుదిపేస్తోంది.

ఇద్దరూ విడిపోయి — మళ్ళీ అంటుకు పోయారు.

ఇద్దరూ ఆ రాత్రి నిద్రకి కరువయ్యారు.

తూరుపు తెల్లవారకముందే, ఆ ఆగంతుకుడు వచ్చిన దారినే వెళ్ళిపోయాడు.

లేచి చూసిన శకుంతల తల తిరిగిపోయింది.

మూలన తుపాకీ ఉంది.

ఎక్కడికి పోయాడో పొద్దు ... నడినెత్తి కొచ్చింది. శకుంతలకు ఆకలి వేయడంలేదు. దాహం వేయడం లేదు. మనసు మనసులో నిలవడం లేదు. ఆలోచనలు ఒక పట్టాన తెమలడం లేదు. తెగడమూ లేదు. అతడను నిజమేనా? అని మనసులో మథన పడుతోంది.

రోజులు ఆగడం లేదు.

నెల గడిచింది.

బహిష్టు ఆగి పోయింది.

రెండు, మూడు — ప్చ్. . .

అనుమానం బలపడింది. !

ఎదురు చూపులు, నిట్టూర్పులు మిగిలాయి.

తల, కడుపు తిరిగి వికారం—

ఎవరికీ తెలియకుండా ఒక రాత్రి తుపాకీతో వెళ్ళి పోయింది శకుంతల!

అడవుల్లోని అడ్రసు చెప్పని భవంతులను వెతికింది. ఫలితం కనిపించడం లేదు.

ఒక రోజు—

ఒక చోట—

కారులో అందమైన శకుంతల భర్త కనిపించాడు.

ఆనందంగా అతణ్ణి సమీపించి కౌగలించుకుంది— శకుంతల!

అతని వెనకున్న భార్యకి నోట మాట రాలేదు.

అతను శకుంతలను చూసి చీదరించుకున్నాడు.

శకుంతలకి మతి పోయింది.

"నీ పాపం కడుపులో పెరుగుతోందండి'

అతని భార్య ఆశ్చర్య పోయింది.

జనం చోద్యం చూస్తున్నారు.

"మీరైనా న్యాయం చెప్పండి. . " చుట్టూ చేరిన జనా న్నుద్దేశిస్తూ అంది శకుంతల.



ఫోటో— ఎస్. ఉమాశంకరశాస్త్రి

అతను ఫారెస్టు కంట్రాక్టర్. అతని దగ్గర పని చేసే వారే చుట్టూ చేరిన జనం. అతని కెదురుగా ఏ ఆధారంతో ఆమెను సమర్థిస్తారు?

"నా ఆస్తి కోసం వేసిన పథకం పారదన్నమాట! నేను తెలివి తక్కువ దద్దమ్మ ననుకున్నావా?" అన్నా డతను.

ఆమె చిత్తరువులా ఉండిపోయింది.

జనంలో కదలిక లేదు.

"ఈ తుపాకీ మీది కాదా. . . ?"

"అనవాలు కాబోలు—" పకపకలు వినిపించాయి.

ఇక ఫలితం లేదనుకుని, భారంగా—కడుపు భారంతో అతనికి అభిముఖంగా అడుగులు వేసుకుంటూ పోతూంటే "పిచ్చి శకుంతల " అనుకున్నా డతను.

ఆమె సాగిపోతోంది.

## 2

నో ప్రముఖ వారపత్రిక కథల పోటీని నిర్వహిస్తూ పై కథను ఇచ్చి, ముగింపును ఐదారు పేజీలకు తక్కువ కాకుండా రాసి పంపవలసిందిగా రచయి(త) త్రులకు పోటీ పెట్టింది.

మొదటి బహుమతి పదిహేనువందలు, మరి మూడు కన్సొలేషన్ బహుమతులు ఐదు వందల రూపాయల చొప్పున ఇవ్వడానికి నిర్ణయించినట్లు ప్రకటించారు.

కొత్త ఊహతో ఈ పోటీ నిర్వహిస్తున్నాం కనుక, రచయి (త) త్రులు యథారీతిన సహకరిస్తారని ఆశిస్తున్నాం.

## 3

పోటికి ఊహించనిరీతిలో కథ లొచ్చాయి. ముగింపు చేయడంలో చాలా మంది రచయి(త)త్రులు కృతకృత్యులు కాలేకపోయారు. సమస్యకు ఒక కొత్త మార్గాన్నీ, కొత్త జీవితగమనాన్నీ, గమ్యాన్నీ, విధానాన్నీ ఇవ్వాలన్న ఆశ, ఆశయం నేటి రచయి(త)త్రులకు కొరవడిందేమోనని సందేహం కలుగుతోంది వచ్చిన కథలను పరిశీలిస్తూంటే!

సగానికి అరవై ఐదు మంది శకుంతలను ఆశ్రమానికి పక్కనే ఉన్న పారే ఏటిలో పడి చావమన్న ముగింపునిచ్చేరు. ఇరవై శాతం గర్భస్రావం చేయించుకోవడమే ఉత్తమమన్నట్టు రాసేరు. మరో పదమూడు శాతం పరిస్థితులను ఎదురొడ్డి పోరాడమని రాసేరు. ఎలా? ఏమిటిలాంటి మార్గాలను చూపక వదిలేసేరు. కాళిదాసు కథను మోడరనైజ్ చేస్తూ శ్రీ కాళిదాస్ గారు రాసేరు. వీరికి కన్సొలేషన్ బహుమతిస్తున్నాం.

భర్త నమ్మించి, వంచన చేసి చివరికి కడుపు పంటకి తను కారణం కాదని తెగేసి చెప్పిన ఆ వయవంచకుడితో తిరిగి ఎలా కాపురం చేయగలదు? అందుకే స్వతంత్రంగా బ్రతికి, అనాథశరణాలయంలో పిల్లాణ్ణి కని, తిరిగి భర్త ముఖం చూడక, అతని ప్రమేయం లేక ఆత్మగౌరవంతో బ్రతుకు వెళ్ళదీసుకు రావాలన్న మార్గాన్ని చూపించిన శ్రీ 'భరత్' గారికి ప్రథమ బహుమతిని ఇస్తున్నామని తెలియచేయడానికి ఆనందిస్తున్నాం.

ఇది ఆ ప్రముఖ వారపత్రిక కథల పోటీల విషయమై వచ్చిన కథలపై సమీక్షిస్తూ వ్రాసింది. ఎంత నిజం.

కాలు జారిన కన్నె పిల్లలకు రచయి(త) త్రులిస్తూన్న గొప్ప పరిష్కారం—చావు!

భర్త ప్రేమకు నోచుకోక, వెలికాబడ్డ భార్యలకు మరో మార్గాంతరం—చావు!

ఉద్యోగాన్వేషణలో వెతికి, విసిగి వేసారిన నిరుద్యోగికి దారి—చావు!

కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుని, హాయిగా కాపురాలు చేస్తూన్న సంసారాలు ఉన్నా— రచయితలు వారికి కొన్ని సమస్యలను ఆపాదించి (కథల్లో, నవలల్లో) ఎక్కువ కులంవాడు భర్త అయితే తక్కువ కులపు భార్యని, తక్కువ కులపు భర్తని ఎక్కువ కులపు భార్య ఈసడించుకుని, అడుగడుక్కీ ఎలా సమస్యల్ని సృష్టించుకుంటారో వ్రాసి—అలాంటి కులాంతర, మతాంతర వివాహాల పట్ల వైముఖ్యాన్ని కలిగేలా చేస్తూన్న (కుహనా) రచయితలు ఉన్నారు.

పరిస్థితిని పదిమందికీ చెబితేచాలు—రచయిత పరిష్కారం పాఠకులను వక్రమార్గాన్ని పట్టించేదిగా ఉండే కంటే! !

*